క్లుప్తంగా

ఉపాధి పనులపై సమీక్ష



సిబ్బందికి సూచనలిస్తున్న ఏపీడీ

పెద్దతిప్పసముద్రం: మండలంలోని ఉపాధి హామీ సిబ్బందితో ములకలచెరువు క్లస్టర్ ఏపీడీ నందకుమార్‌రెడ్డి గురువారం సమీక్షించారు. మండలంలో ఉపాధి కూలీల సంఖ్య గణనీయంగా తగ్గడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. సిబ్బంది గ్రామాలకు వెళ్లి ఉపాధి హామీలో అమలవుతున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పనులు కల్పించి కూలీల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని సూచించారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



వైఎస్సార్‌సీపీ నాయకులతో యువ నేత చింతల సాయికృష్ణారెడ్డి

కలికిరి: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కష్టపడే కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని నియోజకవర్గ యువనేత చింతల సాయికృష్ణారెడ్డి భరోసా ఇచ్చారు. కలికిరిలో గురువారం జరిగిన ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరైన ఆయన మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కష్టపడ్డ వారికి తప్పనిసరిగా తగిన గుర్తింపు ఉంటుందని హామీ ఇచ్చారు. క్షేత్ర స్థాయిలో నాయకులు, కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయన విచారించారు. మైనార్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్ ఖాన్, మండల పార్టీ కన్వీనర్ రమేష్‌కుమార్ రెడ్డి, గుట్టపాళెం సర్పంచ్ వెంకటరెడ్డి, నాయకులు ఎంబి హనీఫ్, మధుసూదన్‌రెడ్డి, ఎస్టీడీ హరి, మహేంద్రరెడ్డి, ఇస్తియాక్ అహ్మద్, సోషల్ మీడియా కార్యకర్తలు యుగంధర్, శామ్యూల్ సమావేశంలో పాల్గొన్నారు.

వ్యవసాయ పరికరాల కాల్చివేత



కాలిపోయిన వ్యవసాయ పరికరాలు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని కమ్మచెరువుకు చెందిన దార సోమశేఖర్ అనే రైతుకు చెందిన వ్యవసాయ పరికరాలను దుండగులు గురువారం రాత్రి కాల్చివేశారు. బాధిత రైతు మాట్లాడుతూ పొలంలో కొత్తగా పంట సాగు చేద్దామని 10 డ్రిప్ కట్టలు, 20 పీవీసీ పైపులు, 200 మీటర్ల కేబుల్ వైరును బోరు వద్ద నిల్వ ఉంచామన్నాడు. పొలం వద్ద ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు వ్యవసాయ పరికరాలతో పాటు మంచాన్ని కూడా కాల్చివేసారని ఆవేదన వ్యక్తం చేసాడు. పొలం వద్ద మంటలు ఎగసి పడుతుండటాన్ని చూసిన కాలనీ వాసులు గుర్తించి తనకు సమాచారం ఇవ్వగా తాము హుటాహుటిన పొలం వద్దకు వెళ్లగా అప్పటికే పైపులు,వైర్లు కాలిపోయాయని ఈ ఘటనలో రూ.60 వేల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశామని రైతు తెలిపాడు.

సమావేశాన్ని జయప్రదం చేయండి

కలకడ: వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశాన్ని మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కమలాకర్‌రెడ్డి కోరారు. శుక్రవారం సాయంత్రం 3.30 గంటలకు పీలేరు పట్టణం కడప రోడ్డు రోడ్డులోని ఎం.ఎం కల్యాణ మండపంలో పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహిస్తారని తెలిపారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

కురబలకోట: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగి సమాజానికి పాటు పడాలని ముదివేడు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ అన్నారు. కురబలకోట జెడ్పీ హైస్కూల్‌లో గురువారం మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో నడుచుకుంటే సగం విజయం సాధించినట్లేనని పేర్కొన్నారు. సాధ్యమైనంత వరకు విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని సూచించారు. చదువుపైనే ధ్యాస ఉండాలన్నారు. విద్యార్థులు బరువు పెరగకుండా ఉండడం కూడా చదువుల్లో రాణించడానికి ఆస్కారం ఉందన్నారు. ఇందుకు తగిన పోషక విలువల ఆహారం తీసుకోవాలని సూచించారు. పిల్లల పట్ల తల్లిదండ్రులు చిన్నప్పటి నుండే జాగ్రత్త వహించాలని తెలిపారు. హెడ్మాస్టర్ జెడ్పీటీసీ బైసాని జ్యోతి, సర్పంచ్ సుక్కా సుజాత పాల్గొన్నారు.

నివాళి

మదనపల్లి: నిమ్మనపల్లె మండలం అగ్రహారానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు సిద్దారెడ్డి మృతి చెందారు. విషయం తెలుసుకున్న సమన్వయకర్త నిస్సార్ అహ్మద్ గురువారం అగ్రహారానికి వెళ్లి సిద్దారెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు.

గురుభావం.. దైవ స్మరణం

- మార్మోగిన సాయినామం
- ఘనంగా గురుపౌర్ణమి
- భక్తులతో కిటకిటలాడిన బాబా ఆలయాలు



మదనపల్లె: భక్తులకు అన్నదానం చేస్తున్న నిస్సార్ అహ్మద్

మదనపల్లె సిటీ: వాడవాడలా గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. సాయినాథుడి దర్శనంతో భక్తులు పులకించిపోయారు. గురువారం మదనపల్లె పట్టణంలోని షిర్డిసాయిబాబా మందిరాలు భక్తులతో పోటెత్తాయి. 'ఓ సాయి శ్రీ సాయి' నామ స్మరణతో మందిరాలు ప్రతిధ్వనించాయి. స్థానిక కోటవీధిలోని శ్రీ షిర్డిసాయిబాబా ఆలయంలో ఉదయం గణపతి, దత్తాత్రేయస్వామికి హోమాలు, పంచామృతాభిషేకం, బాబాకు పంచగవ్య అభిషేకం, మహామంగళహారతి ఇచ్చారు. అర్చకులు సాయిచక్రవర్తి భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. స్థానిక బర్మావీధిలోని శ్రీ షిర్డిసాయిబాబాకు ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. అలాగే స్థానిక బైపాస్ రోడ్డులోని సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సరస్వతినగర్‌లోని సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక వరాల ఆంజనేయస్వామి ఆలయం, బెంగళూరు రోడ్డులోని శ్రీ యోగభోగేశ్వరస్వామి ఆలయాల్లో గురుపౌర్ణమి పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

కనుల పండువగా..

పెద్దతిప్పసముద్రం: స్థానిక శివాలయం సేవకులు సనగరం పట్టాభి రామయ్య ఆధ్వర్యంలో గురువారం జరిగిన గురుపౌర్ణమి వేడుకలు కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ స్వామి, సత్యనారాయణ స్వామి ప్రతిమలకు ప్రత్యేక పుష్పాలతో సుందరంగా అలంకరించి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

పవిత్రమైనది గురుపౌర్ణమి

మదనపల్లె: గురుపౌర్ణమి పవిత్రమైనదని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్ అహ్మద్ అన్నారు. గురువారం స్థానిక అమ్మచెరువుమిట్ట శేషాచలనగర్‌లోని షిరిడి సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు అన్నదాన కార్యక్రమంలో పాల్గొనగా ఆలయ నిర్వాహకులు అయన్ను సత్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శివారెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, బయ్యారెడ్డి, మధు, కృష్ణారెడ్డి, విశ్వనాథరెడ్డి, శ్రీనివాసులు, జబీవుల్లా, యూనస్, సాధిక్ పాల్గొన్నారు.

ఘనంగా వేడుకలు

పీలేరు: గురుపౌర్ణమిని పురస్కరించుకుని గురువారం స్థానిక షిర్డిసాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, హారతి కార్యక్రమాలు చేపట్టారు. పీలేరు పట్టణంలోని పలువురు భక్తాదులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేపట్టారు.

వేడుకగా..

కలికిరి(వాల్మీకిపురం): వాల్మీకిపురం పట్టణ పరిధిలోని సాయినగర్‌లో వెలసిన సాయిబాబా మందిరంలో గురువారం గురుపూర్ణిమ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయినామ స్మరణతో ఆలయం మారుమోగింది. వివిధ రకాల పుష్పాలతో ఆలయాన్ని ముస్తాబు చేశారు. స్వామి వారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయ అర్చకులు అభిషేకం, విశేష పూజలు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా షిర్డి సాయిబాబా చారిటబుల్ ట్రస్టు ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రరెడ్డి దంపతులు సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పడమర ధర్మపథంలో వెలసిన శ్రీకార్యసిద్ది అభయాంజనేయస్వామి ఆలయంలో అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో గురుపూర్ణిమ వేడుకలు నిర్వహించారు.

మల్లయ్యకొండపై ప్రత్యేక పూజలు

తంబళ్లపల్లె: మండలంలో గురువారం గురుపౌర్ణమి సందర్భంగా పలు ఆలయాల్లో పూజలు నిర్వహించారు. మల్లయ్యకొండపై వెలసిన భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జునలు స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. . ఈఓ మునిరాజ, కొండకిట్టల ఆధ్వర్యంలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించి దేవస్థానం ఆధ్వర్యంలో అన్నసంతర్పణ చేశారు.

కలికిరి: పట్టణ పరిధిలో వెలసిన సాయిబాబా ఆలయాల్లో గురువారం గురుపూర్ణిమ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సాయినగర్‌లో వెలసిన బాబా ఆలయం, కాలేజీ రోడ్డులో వెలసిన షిర్డీ సాయిబాబా ఆలయాల్లో గురుపూర్ణిమ వేడుకలలో భాగంగా ఉదయం బాబాకు అభిషేకాలు, విశేష అలంకరణ, హారతి కార్యక్రమాలు చేపట్టారు.

కలకడ మండలంలో..



మదనపల్లె సిటీ: ప్రత్యేక అలంకరణలో షిర్డి సాయిబాబా



కలికిరి: పూజలందుకుంటున్న సాయినాథుడు



తంబళ్లపల్లె: మల్లయ్యకొండపై కొలువైన మల్లికార్జునస్వామి

కలకడ : మండలంలోని బాలయ్యగారిపల్లె పంచాయతీ పెండ్లిమర్రివాండ్లపల్లెలో గురుదత్తాత్రేయ స్వామి ఆలయంలో ఆలయ ధర్మకర్త మధుసూదన్ ఆధ్వర్యంలో కలకడ దొడ్డిపల్లె పంచాయతీ గోపాలపురంలో వెలసిన శ్రీసాయి మందిరంలో ఆలయ ధర్మకర్త పూజారి నాగయ్యస్వామి ఆధ్వర్యంలో, కలకడ బాటవారిపల్లె బీసీ కాలనీలోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ధర్మకర్త యల్లయ్య స్వామి ఆధ్వర్యంలో గురు పౌర్ణమి నిర్వహించారు.



పెద్దతిప్పసముద్రం: సాయిబాబాకు పూజలు చేస్తున్న వేద పండితులు



పీలేరు : సాయిబాబాను దర్శించుకుంటున్న భక్తులు



కలికిరి(వాల్మీకిపురం): సాయిబాబా ఆలయంలో భక్తుల సందడి



కలకడ: సాయినాథుడికి పూజలు చేస్తున్న భక్తులు

నేడు వైఎస్సార్‌సీపీ సమావేశాలు

మదనపల్లె: తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గాలకు సంబంధించి వైఎస్సార్‌సీపీ సమావేశాలు శుక్రవారం పార్టీ నేతలు నిర్వహిస్తున్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గానికి సంబంధించి ఉదయం 9.30 గంటలకు బి.కొత్తకోటలోని బత్తలాపురంరోడ్డులోని పీఎస్‌ఆర్ కల్యాణ మండపంలో జరిగే సమావేశానికి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, జిల్లా అధ్యక్షులు ఆకేపాటి అమరనాథరెడ్డి, ఇతరా పార్టీ నేతలు హాజరైన పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నారు. అలాగే ఉదయం 11 గంటలకు మదనపల్లెలోని బసినికొండ వద్ద కన్వెన్షన్ హాలులో జరిగే సమావేశానికి పార్టీ జిల్లా అధ్యక్షులు అమరనాథరెడ్డి, సమన్వయకర్త నిస్సార్ అహ్మద్, రాజంపేట పార్లమెంటు పరిశీలకులు, కడప మేయర్ సురేష్‌బాబు, పరిశీలకులు అనూషారెడ్డి, పార్టీనేత సుగవాసి సుబ్రహ్మణ్యం తదితరులు హాజరవుతున్నారు.

సీనియర్ సిటీజన్ కేసులపై విచారణ

మదనపల్లె రూరల్: మదనపల్లె సబ్ కలెక్టరేట్ కోర్టు హాలులో గురువారం సీనియర్ సిటీజన్ కేసులపై సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ విచారణ చేశారు. ఆయన మాట్లాడుతూ వృద్ధాప్యంలో తమను పట్టించుకోకపోతే వృద్ధులు ధైర్యంగా సీనియర్ సిటీజన్ యాక్టును సద్వినియోగం చేసుకుని సమస్యలు పరిష్కరించుకోవచ్చునన్నారు. ఇబ్బందులు ఎదుర్కొంటున్న వృద్ధులు తమ సమస్యలపై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. తల్లిదండ్రులను పట్టించుకోని రక్తసంబంధీకులకు నోటీసులు ఇచ్చి విచారించడం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులను పోషించాల్సిన బాధ్యత కన్నబిడ్డలపై ఉందని పేర్కొన్నారు. వృద్ధులు అందించిన ఫిర్యాదులపై సీనియర్ సిటీజన్ చట్టంపై విచారణ చేపట్టి పలు కేసులపై తదుపరి విచారణ నిమిత్తం గడువు ఇచ్చామని తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

రామసముద్రం: ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించి, ప్రయాణికులతో పాటు వారు సురక్షితంగా ఇంటికి చేరుకోవాలని సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ రమేష్‌బాబు సూచించారు. గురువారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆటో డ్రైవర్లకు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు.

మా సర్టిఫికెట్లు ఇప్పించండి సారూ!

- సబ్ కలెక్టర్‌కు విద్యార్థుల వినతిప్రతం



సబ్ కలెక్టర్‌తో మాట్లాడుతున్న కృష్ణచైతన్య ఫార్మసీ కాలేజీ యాజమాన్యం

మదనపల్లె రూరల్: తాము కాలేజీలో ఇచ్చిన ఒరిజనల్ సర్టిఫికెట్లు ఇప్పించాలని కోరుతూ మండలంలోని కృష్ణచైతన్య ఫార్మసీ కాలేజీ విద్యార్థులు గురువారం కాలేజీ యాజమాన్యం కృష్ణారెడ్డితో కలిసి సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌కు వినతిపత్రం అందజేశారు. విద్యార్థులు మాట్లాడుతూ తాము ఫార్మసీ కోర్సులో జాయిన్ అయినప్పుడు ఎస్ఎస్‌సి, ఇంటర్మీడియట్ ఒరిజనల్ మార్కు లిస్టు, టీసీ, స్టడీ, ఇన్‌కమ్ సర్టిఫికెట్లు గత కాలేజీ యాజమాన్యం సభ్యులైన రామ్మోహన్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, గోపాల్‌రెడ్డిలకు అందజేశామన్నారు. తాము కోర్సు ముగించుకుని కళాశాల నుంచి వెళ్లే సమయానికి ప్రస్తుత యాజమాన్యం సర్టిఫికెట్లు చోరీ గురయ్యాయని చెప్పారన్నారు. ఈ విషయమై ప్రస్తుత కాలేజీ యాజమాన్య సభ్యుడు కృష్ణారెడ్డి మాట్లాడుతూ మే 8న తాము కాలేజీని స్వాధీనం చేసుకున్నామన్నారు. అదే రోజున గత యాజమాన్య సభ్యులు విద్యార్థులకు సంబంధించిన ఒరిజనల్ సర్టిఫికెట్లు తమ అనుచరులతో కలిసి కాలేజీ నుంచి తమ అనుమతి లేకుండా దౌర్జన్యంగా తీసుకెళ్లారని తెలిపారు. ఈ విషయమై తాలూకా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారన్నారు. అయితే యాజమాన్య వివాదంపై రామ్మోహన్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, గోపాల్‌రెడ్డి కోర్టుకు వెళ్లాలన్నారు. వివాదం నడుస్తుండగా విద్యార్థు సర్టిఫికెట్లు వెంటనే ఆచూకీ కనుగొని వారికి అందించాలని హైకోర్టు తాలూకా పోలీసులను ఆదేశించిందని పేర్కొన్నారు. ఈ క్రమంలో గత యాజమాన్య సభ్యులు బుధవారం రోజున మరోసారి కాలేజీలో ప్రవేశించి దౌర్జన్యంగా సీసీ కెమరాలు ధ్వంసం చేసి, జెఎన్‌టీయూ తనిఖీలకు సంబంధించిన పత్రాలను తీసుకెళ్లాలన్నారు. ఈ విషయం పోలీసులకు దృష్టికి తెచ్చామన్నారు. దీంతో సబ్ కలెక్టర్ స్పందిస్తూ డీఎస్పీ మహేంద్రకు ఫోన్ చేసి గత యాజమాన్య సభ్యులు ఇళ్లల్లో సోదాలు నిర్వహించి విద్యార్థుల సర్టిఫికెట్లు ఇప్పించాల్సిందిగా ఆదేశించారు.

బుద్ధుడి విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి



ఐక్యత చాటుతున్న ప్రజా సంఘాల నాయకులు

పీలేరురూరల్ : మదనపల్లె మండలం అంకిశెట్టిపల్లె పంచాయతీ బుద్ధుడి కొండపై బుద్ధ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని శిక్షించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ బుద్ధుడి కొండ మానవ వికాస్ కేంద్రంగా, గొప్ప ఆధ్యాత్మిక చైతన్య కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న క్రమంలో బుద్ధ విగ్రహం ధ్వంసం చేయడం హేయమైన చర్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందంను ఏర్పాటు చేసి నిందితులను శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ముల్లంగి చంద్రయ్య, పాలకుంట శ్రీనివాసులు, గుర్రం నారాయణ, టి.ఎల్. వెంకటేష్, సుధాకర్‌బాబు, గండికోటవెంకటేష్, మల్లికార్జున, అమృతతేజ, కృష్ణయ్య, బోదేషావలి తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు అనుగుణంగా ఆర్టీసీ సర్వీసులు

పీలేరురూరల్ : ప్రయాణికులకు అనుగుణంగా ఆర్టీసీ బస్సు సర్వీసులు నడుపుతున్నామని పీలేరు డీఎం బి. నిర్మల అన్నారు. గురువారం స్థానిక బస్టాండ్ ఆవరణలో గురుపౌర్ణమిని పురస్కరించుకుని అరుణాచలానికి రెండు ప్రత్యేక బస్సు సర్వీసులను పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుణ్యక్షేత్రాలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు తెలిపారు. సీఐ ధనుంజయులు, ఏడీసీలు హనీఫ్, రెడ్డెప్ప, బాబునాయక్ పాల్గొన్నారు.

బ్రహ్మకమలం.. పుష్ప వికాసం



హిమాలయాల్లో మాత్రమే వికసించే అరుదైన బ్రహ్మకమలం మదనపల్లెలో పుష్పించింది. గురువారం స్థానిక దొంతివీధికి చెందిన రిటైర్డు ప్రధానోపాధ్యాయుడు జీవీ ప్రసాద్ ఇంట్లో బ్రహ్మకమలం పుష్పాలు విరబూశాయి. రాత్రి వేళల్లో మాత్రమే బ్రహ్మకమలం పూలు వికసించి ఆకట్టుకుంటున్నాయి. పరమ శివునికి అత్యంత ప్రీతిపాత్రమైన ఈ పుష్పం ఏడాదికి ఒకసారే పుష్పిస్తుంది. ఈ పుష్పాలను తిలకించేందుకు కాలనీవాసులు తరలివస్తున్నారు. –మదనపల్లె

సమస్యల పరిష్కారానికి కృషి

కలకడ : సిబ్బంది సహకారంతో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మండల డిప్యూటీ ఎంపీడీఓ ఆర్. ప్రతాప్‌రెడ్డి తెలిపారు. గురువారం డిప్యూటీ ఎంపీడీఓగా ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మండల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తామన్నారు.

నిమ్మనపల్లె: డిప్యూటీ ఎంపీడీఓగా బాలరాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. పుంగనూరు మండంలో గ్రేడ్–1 పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న ఆయన పదోన్నతిపై నిమ్మనపల్లె డిప్యూటీ ఎంపీడీఓగా నియమితులయ్యారు. ఎంపీడీఓ రమేష్‌కు నియామక ఉత్తర్వులు అందించి విధుల్లో చేరారు.

పంచాయతీ కార్యదర్శుల సంఘం ఎన్నిక



డిప్యూటీ ఎంపీడీఓతో కమిటీ సభ్యులు

పెద్దమండ్యం: పెద్దమండ్యం మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడిగా ఎం. జనార్దన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీధర్‌రావు అధ్యక్షతన గురువారం పంచాయతీ కార్యదర్శుల సంఘం ఎన్నిక నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా సి. సుబ్రహ్మణ్యం కోశాధికారిగా కె బాలాజీ, సభ్యులుగా శైలజ, జగన్, శేచాద్రి, గోవర్ధన్‌రెడ్డి, వరప్రసాద్‌నాయక్, మంజుభార్గవి, ఖాదర్ బాషా, లక్ష్మీప్రసన్న, హరిప్రసాద్, ఖాదర్‌బాషాను ఎన్నుకున్నారు.

నిమ్మనపల్లె: నిమ్మనపల్లె మండల గ్రామ పంచాయతీ కార్యదర్శుల అధ్యక్షుడిగా ఎ.వెంకటరమణారెడ్డి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. గురువారం ఎంపీడీఓ రమేష్, డిప్యూటీ ఎంపీడీఓ బాలరాజు ఆధ్వర్యంలో కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా గాయిత్రి, కోశాధికారి నాగభూషణం, ప్రధాన కార్యదర్శి పి.గౌతమి, మీడియా ప్రతినిధిగా రజితను ఎన్నుకున్నారు.

మండల మీట్‌కు అధికారుల గైర్హాజరు

- ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక ఆగ్రహం
- మెమో జారీ చేయాలని ఆదేశం



మాట్లాడుతున్న ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక

పెద్దమండ్యం: మండల సర్వ సభ్య సమావేశానికి కొన్ని శాఖల అధికారులు గైర్హాజరు కావడంపై ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. మండల సర్వసభ్య సమావేశం సందర్భంగా ములకలచెరువు సీఐ, ఇద్దరు ఎస్‌ఐల ఆధ్వర్యంలో సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎంపీడీవో కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద, కార్యాలయంలో లోపల గేటు వద్ద రెండు చోట్ల చెక్‌పాయింట్లను ఈ సందర్భంగా పోలీసులు ఏర్పాటు చేశారు. ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచ్‌లు, కూటమి ప్రభుత్వం సూచించిన వారిని పోలీసులు కార్యాలయం లోపలికి పంపారు. సమావేశాన్ని ఎంపీడీవో శ్రీధర్‌రావు ప్రారంభించగా, కొన్ని శాఖల అధికారులు సమావేశానికి గైర్హాజరు కావడంపై ఎంపీపీ మండిపడ్డారు. గైర్హాజరైన అధికారులకు మెమోలు ఇవ్వాలని ఎంపీడీవోను ఆదేశించారు.

చర్యలు తీసుకుంటాం

మండల పరిధిలోని గ్రామాల్లో తాగునీటి సమస్య ఏర్పడితే తక్షణమే చర్యలు తీసుకుంటామని ఏఈ అశోక్‌కుమార్ తెలిపారు. ప్రతి గ్రామ సచివాలయం వద్ద కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లను నిర్మిస్తున్నట్లు చెప్పారు. స్వయం సహాయక సంఘాలలోని మహిళలకు బ్యాంక్ లింకేజి, స్త్రీనిధి, ఉన్నతి ద్వారా రుణాలను ఇస్తున్నట్లు ఏపీఎం నరసింహులు తెలిపారు. మండలంలోని దిగువపల్లెలో రీసర్వే పనులు జరుగుతున్నట్లు తహసీల్దార్ తేజస్వీ చెప్పారు. రీసర్వేలో ఎదురవుతున్న సమస్యలు ఆక్కడికక్కడే పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు ఆమె తెలిపారు. మండల అభివృద్ధికి పార్టీలకు అతీతంగా అందరూ సహకరించాలని ఎంపీపీ కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పీరమ్మ, వైస్ ఎంపీపీలు టి. జయచంద్రారెడ్డి, శారదమ్మ, సర్పంచ్‌లు సోదనపల్లె బాషా, మొలకబయ్యారెడ్డి, జింకా విశ్వనాథ, కంటి విశ్వనాథరెడ్డి, సుధాకరనాయుడు, ఎంపీటీసీ సభ్యులు మంచూరి జయరాం, బోడిమాని గీత, నరసమ్మ, ఇతరశాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బీటీ కాలేజీలో అన్ని కోర్సులు ప్రారంభించాలి



ఆర్‌జేడీకి వినతిపత్రం అందజేస్తున్న బహుజన యువసేన నాయకులు

మదనపల్లె సిటీ: బీటీ ప్రభుత్వ కాలేజీలో అన్ని కోర్సులను ప్రారంభించి, పూర్వ వైభవం తీసుకురావాలని ఆర్‌జేడీ నాగలింగారెడ్డిని బహుజన యువ సేన అధ్యక్షులు పునీత్ కోరారు. గురువారం కాలేజీలో రిటైర్డు ప్రిన్సిపాల్ ఆనందరెడ్డి పనిచేసిన కాలంలో సంబంధించిన పనులు, ఇతర విషయాలపై విచారణకు ఆర్‌జేడీ వచ్చారు. ఈ సందర్భంగా ఆర్‌జేడీకి పునీత్ వినతిప్రతం ఇచ్చారు. గతంలో బీటీ కాలేజీ ప్రభుత్వ పరం చేస్తున్నట్లు విడుదలైన జీఓ అనంతరం ప్రభుత్వం టీచింగ్, నాన్ టీచింగ్ జాబితాను కోరడం జరిగిందన్నారు. అప్పటి కరస్పాండెంట్ అవినీతికి పాల్పడుతూ కనీస అర్హత లేని జాబితాను ప్రభుత్వానికి పంపారని తెలిపారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారించాలని వినతి ప్రత్రంలో కోరారు. రమేష్, హరిక్రిష్ణ, శశికుమార్, వినయ్, జిలానీబాషా తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే ఉన్నత శిఖరాలు

మదనపల్లె సిటీ: విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ కలిగి ఉంటే జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించడం సాధ్యమవుతుందని డీఎస్పీ మహేంద్ర అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహించారు. సోషల్ మీడియాలో తమ పిల్లల వాడకంపై తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలని సూచించారు. మదనపల్లె పట్టణం జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీల్లో జరిగిన మెగా పీటీఎం కార్యక్రమంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా హాజరయ్యారు.

విద్యార్థులు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలి

కలకడ : విద్యార్థులు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని తహసీల్దార్ మహేశ్వరిభాయ్, ఎంపీడీఓ భానుప్రసాద్ సూచించారు. గురువారం మండలంలోని కలకడ ఆదర్శ పాఠశాలలో పాఠశాల చైర్మన్ రమేష్‌నాయుడు అధ్యక్షతన మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారి మునీంద్రనాయక్, ఎస్‌ఐ రామాంజనేయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామసముద్రం: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహించారు. ఎంపీడీవో గఫూర్, ఎంఈవో -1, హేమలత-2 , ఆంజనేయులు, డీఎల్‌పీవో నాగరాజులు పలు పాఠశాలల్లోని సమావేశాలకు హాజరై పరిశీలించారు. రామసముద్రం ఈస్ట్ పాఠశాలలో ఎంఈవో హేమలత, హెచ్‌ఎం హేమలత ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.

కేవీపల్లె : ప్రభుత్వ పాఠశాలల పురోభివృద్ధికి సమష్టి కృషి అవసరమని తహసీల్దార్ నరేంద్రకుమార్, ఎంపీడీవో సుధాకర్ అన్నారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో గురువారం మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహించారు. ఎంఈవోలు రెడ్డిబాషా, సుబ్రహ్మణ్యంరెడ్డి, ప్రిన్సిపాల్ శీనునాయక్‌పాల్గొన్నారు.

పీలేరు రూరల్ : విద్యాభివృద్ధికి తల్లిదండ్రులు తోడ్పాటు అందించాలని తమసీల్దార్ ఎం. శివకుమార్, ప్రత్యేకాధిఆరి కృష్ణ కిషోర్ అన్నారు. గురువారం మండలంలోని అన్ని అన్ని పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో శివశంకర్, ఎంఈవో పద్మావతి, హెచ్‌ఎం జయపాల్‌రెడ్డి, సీఆర్‌పీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ మహేంద్ర

తంబళ్లపల్లె: విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులు, టీచర్లు, అధ్యాపకులదే ప్రముఖ పాత్ర అని ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ సుధాకర్ తెలిపారు. గురువారం మండలంలోని అన్ని పాఠశాలలో మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ నిర్వహించారు. పూర్వపు విద్యార్థి మరిమిరెడ్డిగారిపల్లెకు చెందిన బందార్ల మధుకర్‌రెడ్డి దంపతులు పాఠశాల అభివృద్ధికి రూ.లక్ష చెక్కును హెచ్‌ఎం మదన్‌మోహన్‌కు అందజేశారు.

నిమ్మనపల్లె: ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో వ్యవహరిస్తే పాఠశాలల అభివృద్ధి సాధ్యమవుతుందని మండల ప్రత్యేక అధికారి బి.సతీష్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని కేజీబీవీలో మెగా టీచర్స్ పేరెంట్స్ డే కార్యక్రమం నిర్వహించారు. సర్పంచు చంద్రాయుడు, ఎంపీడీఓ రమేష్, ఎంఈఓ పద్మావతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.